
సాక్షి గుంటూరు

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,212 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,376 క్యూసెక్కులు విడుదలయ్యాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5853 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు ముస్లిం మైనార్టీ ముఖ్యనాయకుల సమావేశం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ముస్లిం మైనార్టీ ముఖ్య నాయకుల సమావేశం తాడేపల్లిలోని శుభమస్తు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ వి.ఖాదర్‌బాషా తెలిపారు. ఆయన ఈ సమావేశం ఏర్పాట్లను పరిశీలించేందుకు బుధవారం తాడేపల్లి చేరుకున్నారు. సభావేదిక, బయట భద్రత ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ సెక్రటరీ దివాన్ మైదెన్



తెనాలిటౌన్: జగనన్న లేఅవుట్లలో నిర్మాణంలో ఇళ్ల పనులు వేగవంతంగా జరగాలని గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ సెక్రటరీ బీఎం దీవాన్ మైదెన్ అధికారులను ఆదేశించారు. కొలకలూరు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. నీటి సౌకర్యం లేదని, పూర్తయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని లబ్ధిదారులు అధికారులను కోరారు. సమస్యలను పరిష్కరించాలని స్పెషల్ సెక్రటరీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, డీఈ రఫీ, ఏఈ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫణీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



పాత గుంటూరు: ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లా రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సభ గుంటూరు -2 డిపో గ్యారేజీలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్, అసిస్టెంట్ డైరెక్టర్ శోభా మంజరి, జిల్లా ప్రజా రవాణా అధికారి జి.విజయగీత పాల్గొన్నారు. జిల్లాలో ఉత్తమ డ్రైవర్లుగా 18 మందిని గుర్తించి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నర్రా శ్రీనివాసరావు, డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి యార్డులో రైతులకు ఉచిత భోజనం

మిర్చి యార్డు చైర్మన్ ఏసురత్నం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో ఈ నెల 6వ తేదీ నుంచి రైతులకు ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం చెప్పారు. మిర్చి యార్డులో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత భోజనానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. గత ఏడాది మిర్చి సీజన్‌లో రూ.8,500 కోట్ల వ్యాపారం చేయడం జరిగిందని, యార్డు పాలకవర్గం, అధికారుల సమన్వయంతో ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం చేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. యార్డుకు ప్రస్తుతం రోజుకు లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తున్నాయని, రెండు లక్షల బస్తాలు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు శ్రీకాంత్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.3,400, మోడల్ ధర రూ.3,000 వరకు పలికింది.



చిలకలూరిపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

వీధివీధిలో పింఛన్ల పండుగ

నెహ్రూనగర్(గుంటూరు): ఒకటో తేదీ వీధి వీధిలో పింఛన్ల పండుగ నెలకొంది. వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో మొదటి రోజు 77.9 శాతం పంపిణీ పూర్తయింది. 2,53,754 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.69.68 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 1,97,671 మంది లబ్ధిదారులకు రూ.54.32 కోట్లు అందజేశారు.

8,983 మందికి పింఛన్ల పంపిణీ

నరసరావుపేట: పురపాలక సంఘం పరిధిలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు అందజేశారు. 33 సచివాలయాల పరిధిలో 11,075 మంది లబ్ధిదారులు ఉండగా 8,983 మందికి (81.11 శాతం) అందజేశారు.

ఎస్పీఎల్ విజేత ఎస్‌కేబీఆర్‌టీ

- రన్నర్‌గా విజ్ఞాన్ డిగ్రీ కళాశాల
- జూనియర్స్ విభాగంలో విజేతగా కళ్లం హరనాథ్‌రెడ్డి కళాశాల జట్టు
- రన్నర్‌గా జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల
- విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు అందజేత

ప్రత్తిపాడు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) విజేతగా సీనియర్స్ విభాగంలో ఎస్‌కేబీఆర్‌టీ డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. జూనియర్స్ విభాగంలో కళ్లం హరనాథ్‌రెడ్డి కళాశాల జట్టు విజయం సాధించింది. ఏపీ, తెలంగాణల్లోని ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు గత నెల 25 నుంచి నిర్వహిస్తున్న సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్ బుధవారంతో ముగిసింది. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో జరిగిన ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్లుగా ఏపీఎండీసీ, వివా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవహరించాయి. ఆఖరి రోజు సెమీ ఫైనల్స్‌లో ఒక మ్యాచ్, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP
Regional sponsor

SPL SAKSHI PREMIER LEAGUE
District sponsor

APMDC | APMDC FOUNDATION | VIVA



సీనియర్ విన్నర్ ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ రాజకుమారి, కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్



జూనియర్ విన్నర్ కళ్లం కళాశాల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు



సీనియర్ రన్నర్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జేసీ రాజకుమారి, కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్



ట్రోఫీ అందుకుంటున్న జూనియర్ రన్నర్ జీవీఆర్‌అండ్‌ఎస్ కళాశాల జట్టు

జీవీఆర్ అండ్ ఎస్ ఘన విజయం..

మొదటి మ్యాచ్ సెమీ ఫైనల్స్ విభాగంలో జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల వర్సెస్ చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చేబ్రోలు కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 66 పరుగులకే పరిమితమవ్వడంతో జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల జట్టు 28 పరుగులతో ఘన విజయం సాధించింది. 26 బంతుల్లో 28 పరుగులు సాధించిన షాలెంరాజ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

జూనియర్స్ విభాగంలో కళ్లం హరినాథరెడ్డి కళాశాల జట్టు జయభేరి..

సాక్షి ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ క్షణ క్షణం ఉత్కంఠగా సాగాయి. జూనియర్స్ విభాగంలో ఫైనల్ మ్యాచ్ కళ్లం హరినాథ్‌రెడ్డి కళాశాల వర్సెస్ జీవీఆర్ అండ్ ఎస్ జట్ల మధ్య జరిగింది. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బాబు టాస్ వేశారు. జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కళ్లం హరనాథ్‌రెడ్డి జట్టు కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 71 పరుగులు సాధించి, తొమ్మిది వికెట్లతో జయభేరి మోగించింది. రెండు ఓవర్లలో రెండు వికెట్లు తీసి 15 పరుగులు, 10 బంతుల్లో 14 పరుగులు చేసిన బాలాజి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

అదరగొట్టిన ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టు..

సీనియర్స్ విభాగంలో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఎస్‌కేబీఆర్‌టీ డిగ్రీ కళాశాల జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్ టాస్ వేశారు. ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విజ్ఞాన్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 46 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌కేబీఆర్‌టీ కళాశాల జట్టు కేవలం 3.4 ఓవర్లలోనే ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 48 పరుగులు చేసి 10 వికెట్లతో టోర్నమెంట్ విజేతగా నిలిచింది. 13 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో 27 పరుగులు సాధించిన తోఫిక్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

జేసీ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేత..

ఎస్పీఎల్ ముగింపు కార్యక్రమానికి అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. సీనియర్స్ విభాగంలో విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన ఎస్‌కేబీఆర్‌టీ డిగ్రీ కళాశాల జట్టు, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల జట్టుకు, జూనియర్స్ విభాగంలో విన్నర్, రన్నర్‌లుగా నిలిచిన కళ్లం హరనాథ్‌రెడ్డి కళాశాల, జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లును జేసీ రాజకుమారి అందించారు.



ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిట్స్ కళాశాల సెక్రటరీ కె.శేఖర్ మాట్లాడుతూ క్రికెట్‌కు వరల్డ్ పాపులారిటీ ఉందన్నారు. క్రీడలను స్పోర్టివ్‌గా తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఏటా తమ కళాశాలలో టోర్నమెంట్ నిర్వహిస్తున్న సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జేసీ రాజకుమారి మాట్లాడు తూ క్రికెట్‌ను చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్క రూ చూస్తూ ఆస్వాదిస్తారని చెప్పారు. పోటీల్లో గెలుపోటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు.

సాక్షి జిల్లా మేనేజర్ టి.గోపి మాట్లాడుతూ 2019 నుంచి క్రమం తప్పకుండా సాక్షి ప్రీమియర్ లీగ్‌ను సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 44 జట్లు పాల్గొన్నాయని తెలిపారు.



క్రీడాకారుల కేరింత

వైభవంగా వ్యాసుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

- తొమ్మిది అడుగుల విగ్రహం ఏర్పాటు
- వేడుకలకు హాజరైన భక్తజనం

అమరావతి: వైకుంఠపురంలోని భగవాన్ వేదవ్యాస సనాతన, ధర్మక్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వ్యాసభగవానుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. భవఘ్ని ఆరామ వ్యవస్థాపకులు భవఘ్నిగురూజీ దంపతుల చేతుల మీదుగా ఉదయం 9:23 గంటలకు వ్యాసదేవుని విగ్రహ ప్రతిష్టాపన, యంత్రస్థాపన నిర్వహించారు. తొలుత నిత్య హోమాలు, మండపదేవతా పూజలు, గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస కార్యక్రమాలను రుత్వికులు నిర్వహించిన అనంతరం ప్రతిష్టా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అశేష భక్తజన వాహిని మధ్య తొమ్మిది అడుగుల ఎత్తుగల వ్యాసభగవానుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో దేవాలయ శిఖరానికి మహాకుంభాభిషేకం జరిపారు. వ్యాసభగవానుడి విగ్రహానికి విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. హోమం నిర్వహించి మహాపూర్ణాహుతిని పూర్తిచేశారు. భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. డీఎస్పీ ఆదినారాయణ, ఎస్ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవంలో పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు దంపతులు, మాజీ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఏపీ అసెంబ్లీ సలహాదారుడు పట్టాభిరామాచార్యులు, అఖిల భారత పంచాయతీ పరిషత్ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.




భవఘ్ని గురూజీతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు



కుంభాభిషేకానికి కలశాలతో వెళుతున్న వేదపండితులు

ఆధ్యాత్మిక కేంద్రంగా వైకుంఠపురం..

ఒకవైపు ఉత్తర వాహినిగా కృష్ణానది, క్రౌంచగి పర్వతంపై స్వయంభువుగా వెలసిన సాలగ్రామ వేంకటేశ్వరుడు, మరోవైపు నిత్యం భగవద్గీతారాధనతో విలసిల్లుతున్న భవఘ్ని ఆరామం, ప్రస్తుతం భగవాన్ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రం ఇలా ఇన్ని ఆధ్యాత్మిక ప్రత్యేకతలున్న వైకుంఠపురం ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. పుణ్యక్షేత్రాల నిలయంగా భక్తులను ఆకర్షిస్తోంది.



పూజలందుకుంటున్న వ్యాసభగవానుడు

మిశ్రమ స్పందన

కేంద్ర బడ్జెట్‌పై విభిన్న వర్గాల అభిప్రాయ మాలిక

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పట్ల మిశ్రమ స్పందన లభిస్తోంది. ఎన్నికల బడ్జెట్ అని, అభివృద్ధి ఊసే లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైల్వే బడ్జెట్‌పై ఇంకా స్పష్టత రావాల్సిఉంది. రైల్వే బడ్జెట్ గత బడ్జెట్ కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ మొత్తాన్ని కేటాయించడంతో ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయన్న ఆశలు కనపడుతున్నాయి.

రూ.7 లక్షలకు ఆదాయ పన్ను శ్లాబ్ పెంపు

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆదాయపు పన్ను శ్లాబ్ ఐదు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయలకు పెంచడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాది ఉద్యోగులు బడ్జెట్ కోసం ఎదురుచూసి నిరుత్సాహపడేవారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్నును రూ.7 లక్షలకు మినహాయింపు ఇవ్వడం పట్ల ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెన్షనర్లకు సంబంధించి శ్లాబ్ రేటు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో వయస్సు ఆధారంగా శ్లాబ్ కేటాయింపులు ప్రకటించారు. ఇప్పుడు వయస్సు నిర్ధారణ లేకుండా రూ.7 లక్షలకు పెంచినట్లు ప్రకటించడంతో వారిలో కొంత అయోమయం వ్యక్తం అవుతోంది.

రుణాల లక్ష్యం 11 శాతానికి పెంపుపై హర్షం

బడ్జెట్‌లో రైతులకు ఇచ్చే పంట రుణాల లక్ష్యాన్ని 11 శాతానికి పెంచడం కొంత మేర ఉపయోగపడుతుందని రైతు సంఘాలు అంటున్నాయి. స్వల్పకాలిక పంట రుణాలను ఏడు శాతం వడ్డీ రేటుకు, తనఖా లేని రుణ పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.60 లక్షలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం అవుతోంది. సేంద్రియ సాగుకు పెద్దపీట వేశారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు డిజిటలైజేషన్ చేసుకునేందుకు నిధులు కేటాయించారు. దీనివల్ల జిల్లాలోని 164 సంఘాలు డిజిటలైజేషన్ కానున్నాయి. బయోఇన్‌పుట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రకృతి సాగుకు ఉపయోగం కలుగనుంది. జిల్లాలో 40 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించడం వల్ల వ్యవసాయం మరింత లాభసాటిగా మారేందుకు అవకాశం ఏర్పడింది. ఎయిమ్స్‌కు కేటాయింపులు జరిగాయి. దేశంలోని 22 ఎయిమ్స్‌లకు రూ.6,385 కోట్లు కేటాయించారు. మంగళగిరి ఎయిమ్స్ ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. నిధుల కేటాయింపు వల్ల మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. ప్రధానమంత్రి మత్స్య సంపద అనే కొత్త పథకాన్ని తీసుకురావడం తీరంలోని మత్స్యకారుల కుటుంబాలకు ఉపయోగపడుతుందన్న భావన వ్యక్తం అవుతోంది. జీఎస్టీ పరిధిని రూ.50 లక్షలు నుంచి కోటి రూపాయలు చేయాలని వ్యాపారులు కోరారు. దీనిపై నిర్ణయం వస్తుందని ఎదురు చూసిన వారికి నిరాశ ఎదురైంది.

రాష్ట్రానికి చేదు బడ్జెట్ ఇది



రాష్ట్రానికి చేదు బడ్జెట్ ఇదీ. రాష్ట్రానికి సంబంధించి అనుకున్న మేలు ఏ మాత్రం జరగలేదు. విభజన హామీలు, ప్రాజెక్టులకు సంబంధించి నిరాశ మిగిల్చారు. అయితే దేశానికి సంబంధించి మాత్రం పర్వాలేదు. నూతనంగా ఎటువంటి ప్రాజెక్టు, ఏపీకి మేలు చేకూరేలా ఎటువంటి బడ్జెట్ కేటాయించకపోవటం బాధాకరం.

– డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి అన్యాయం జరిగింది. విభజన చట్టంలో హామీల అమలుకు కేటాయింపులు లేకపోవడం శోచనీయం. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయట పడేసేందుకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం. విద్యారంగానికి కేవలం 2.36 శాతం నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారు.

– కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

అభివృద్ధికి దోహదపడే బడ్జెట్



అభివృద్ధికి దోహదపడే బడ్జెట్ ఇది. ఆదాయ పన్ను పరిమితి పెంపు వల్ల దిగువ మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుంది. రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యత కల్పించారు. వివక్షకు తావులేకుండా అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయింపులు చేశారు. ఇది ఎన్నికల బడ్జెట్ ఏమాత్రం కాదు. సామాన్య మానవుడి అభివృద్ధి బడ్జెట్.

– జూపూడి రంగరాజు, లీగల్ సెల్ ప్రముఖ్, బీజేపీ

వ్యవసాయ రంగానికి మేలు చేకూరదు



ఈ బడ్జెట్‌తో వ్యవసాయ రంగానికి మేలు చేకూరలేదు. రూ.20 లక్షల కోట్లు రైతాంగానికి అందిస్తామని ప్రకటించారు. అయితే రైతులకందించేందుకు యంత్రాంగం అందుబాటులో లేదు. వ్యవసాయ రంగం గతంలో జీడీపీలో 59 శాతం ఉండేది. ప్రస్తుతం 13 శాతానికి తగ్గింది. ఏపీకి అన్యాయం జరిగింది.

– యలమంచిలి శివాజీ, మాజీ ఎంపీ

రాష్ట్రానికి కేటాయింపులు నిల్



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడం బాధాకరం. విభజన హామీలను నెరవేర్చలేదు. పోలవరానికి నిధులు కేటాయించలేదు. పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేలేదు. జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించాలని వినతులు అందించినా ప్రయోజనం లేదు.

– ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్

వేతన జీవులకు కాస్తంత ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రభుత్వ ఉద్యోగులు, వేతన జీవులకు కాస్తంత ఊరట కలిగించింది. గతంలో 5 లక్షల నుంచి ఉండే ట్యాక్స్ ఇప్పుడు 7 లక్షల రూపాయల వరకు ట్యాక్స్ లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల ఉద్యోగులకు మేలు జరుగుతుంది.

– సయ్యద్ చాంద్‌బాషా, జిల్లా అధ్యక్షుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

రాష్ట్రానికి మొండిచేయి



బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదు. విభజన హామీల విషయంలో మొండిచేయి చూపింది. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు, రాజధాని అభివృద్ధికి నిధులు ఊసే బడ్జెట్‌లో లేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయింపు జరగలేదు. సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేని బడ్జెట్.

– పాశం రామారావు, జిల్లా కార్యదర్శి, సీపీఎం


జిమ్మిక్కుల బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం అభివృద్ధిపై ప్రస్తావనే లేదు. డిజిటల్ పద్ధతిలో వ్యవసాయం రంగానికి కేటాయింపుల వల్ల ఈ రంగం అభివృద్ధి చెందదు. రైతుల ఆగ్రహానికి గురవుతున్న మోదీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదు.

– కంచుమాటి అజయ్, జిల్లా కార్యదర్శి, రైతు సంఘం

వ్యవసాయ రంగానికి పెద్దపీట



కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు అనుకూలమైనది. ఆదాయ పన్ను పరిమితి రూ.7 లక్షల వరకు పెంచడం ఉపయోగకరం. జీఎస్టీలో మార్పులు ఊహించినప్పటికీ ఏమి చేయకపోవడం నిరాశ పరిచింది. యువత, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడం హర్షణీయం.

– డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, డెప్యూటీ చైర్మన్, ఆల్ ఇండియా టాక్స్ ప్రాక్టీషనర్

ప్రత్యేక హోదా ఊసే లేదు



రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్‌లో ప్రత్యేక హోదా ఊసే లేదు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రతిసారి తీరని లోటు స్పష్టంగా కనపడుతోంది. ఈ బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి సంబంధించి మొక్కుబడిగా వ్యవహరించారు. రైల్వేజోన్‌లు, హోదా, విభజన హామీలను మరిచారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరిగే విధంగా ఉంది.

– పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ నేత

మహిళలను నిరుత్సాహపరిచింది



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బంగారం, వెండి ధరలు పెరగడం మహిళలను నిరుత్సాహపరిచింది. బ్రాండెడ్ రెడీమేడ్ వస్త్రాల రేట్లు పెరగటం కూడా మధ్యతరగతికి ఇబ్బందికరం. ఎలక్ట్రికల్ వాహనాల రేట్లు తగ్గుతాయని ప్రకటించడం హర్షణీయం. కిచెన్‌లో చిమ్నీల రేటు తగ్గడం మహిళలకు సంతోషాన్ని కలిగిస్తుంది.

– అల్లూరి లక్ష్మీ శ్రీనిజ, గృహిణి

బేల్దారి మేస్త్రీ నుంచి లిక్విడ్ గంజాయి స్వాధీనం

నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ సుప్రజ, పక్కన సూపరింటెండెంట్ అన్నపూర్ణ, ఏఎస్, సీఐలు

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి విక్రయించే బేల్దారి మేస్త్రీని ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈఓ బృంద పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.1.40 లక్ష విలువ చేసే లిక్విడ్ గంజాయి డబ్బాలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని ఎస్ఈబీ గుంటూరు–1 స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ వివరించారు. ముందస్తు సమాచారంతో ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈఓ బృంద పోలీసులు సంయుక్తంగా బుధవారం ఉదయం గుజ్జనగుండ్ల– పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్ వద్ద విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని నిలిపి తనిఖీలు చేయగా ఓ యువకుడు ఉడాయించాడు. పట్టుబడిన వ్యక్తి జయంతినగర్ ఆరో వీధికి చెందిన బేల్దారి మేస్త్రీ జె.వెంకటేశ్వర్లుగా పోలీసులు గుర్తించారు. పరారైన వ్యక్తి మారుతీనగర్‌కు చెందిన షేక్ తాజుద్దీన్ అని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వీరిద్దరూ స్నేహితులని, ఇద్దరు కలిసి గంజాయి తాగేవారు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసై లిక్విడ్ గంజాయి డబ్బాలను రూ.2,500లకు విక్రయించడం ప్రారంభించారు. నేరం రుజువుకావడంతో వెంకటేశ్వర్లను అరెస్ట్ చేసి, రూ.1.40 లక్షల విలువ చేసే 676 గ్రాముల లిక్విడ్ గంజాయి, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న తాజుద్దీన్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నాటుసారా, గంజాయి, మత్తు పదార్థాలు, జూదం, అక్రమ మద్యం/ ఇసుక రవాణాపై సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు ఫిర్యాదు చేయాలని ఏఎస్పీ సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతా మని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ, ఏఎస్ కె.మణికంఠ, ఎస్ఈబీ గుంటూరు– 2 సీఐ ఎం.రమేష్, డీఎస్ఈఓ టీం సీఐ టీపీ నారాయణస్వామి, ఎస్ఐ కల్యాణ చక్రవర్తిలను ఏఎస్పీ అభినందించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్. ఎం. వేణుగోపాల్ రెడ్డి

పాత గుంటూరు: జిల్లాలోని పరిశ్రమల అవసరాల మేరకు నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను శిక్షణ అందించేలా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో స్కిల్ హబ్స్, స్కిల్ కళాశాల పనితీరుపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది స్కిల్ హబ్స్ ఏర్పాటు చేయగా ఇంకా శిక్షణ తరగతులు ప్రారంభించని రెండు హబ్స్‌ను ఫిబ్రవరి 10 నాటికి సిద్ధం చేయాలని కోరారు. నైపుణ్య శిక్షణ కోసం నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి సంస్థ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించేలా పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేకంగా పోస్టర్లు రూపొందించి అన్ని సచివాలయాల్లో ప్రదర్శించాలని చెప్పారు. ప్రతి నెల నియోజకవర్గాల్లో నిర్వహించే జాబ్ మేళాల్లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీలోని అధికారులందరిని భాగస్వాములను చేసి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ముందస్తుగా జాబ్ మేళాపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను సమీక్షించేందుకు ప్రతి నెల మొదటి మంగళవారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, ప్రతి నెలలో జరిగిన పురోగతిపై నివేదిక అందించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, జెడ్పీ సీఈఓ జే మోహన్‌రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్, ఉపాధి అధికారి రఘు, జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ ప్రసాద రెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కే విజయ రత్నం, మెప్మా పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పాత గుంటూరు: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు మెరుగుపరచడంలో నిర్లక్ష్యం వహించే పర్యవేక్షణాధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం తాడేపల్లిలోని ఎంటీఎంసీ మున్సిపల్ అదనపు కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి హాజరయ్యారు. ఈసందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ లేకుండా వెంటనే మంజూరు చేసేందుకు తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి జిల్లా అధికారులు జారీ చేసే ఆదేశాలు, మార్గదర్శకాలను సచివాలయ ఉద్యోగులకు వెంటనే చేరవేసేలా పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరామిరెడ్డి, జెడ్పీ సీఈఓ జే మోహన్‌రావు, సీపీఓ శేషశ్రీ పాల్గొన్నారు.

పలు రైళ్లు తాత్కాలిక రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని న్యూ గుంటూరు– నంబూరు స్టేషన్‌ల పరిధిలోని రైల్వే పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లు తాత్కాలిక, పాక్షిక రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ఆంజనేయులు బుధవారం తెలిపారు. రైలు నంబర్ 07464 విజయవాడ–గుంటూరు, 07465 గుంటూరు–విజయవాడ, 07628 విజయవాడ–గుంటూరు, 07786 గుంటూరు–రేపల్లె రైలు ఈనెల 1,4,5వ తేదీలలో తాత్కాలిక రద్దు చేసినట్లు వివరించారు. అదే విధంగా రైలు నెంబర్ 17282 నరసరావుపేట– గుంటూరు రైలు ఈనెల 4,5వ తేదీలలో వయా తెనాలి మీదుగా మళ్లించినట్లు చెప్పారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికలకు పరామర్శ



ఏరియావైద్యశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: గురుకులంలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బుధవారం రాత్రి ఆయన పరామర్శించారు. ప్రతి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమని, అయితే ఒక్క విద్యార్థిని కూడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన వైద్య సేవలను వైద్య బృందం అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం గుంటూరులో ఆరుగురు చికిత్స పొందుతున్నారని, సత్తెనపల్లి వైద్యశాలలో 30 మంది మూడు బ్లాకుల్లో వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, విద్యార్థినులు అంతా కోలుకొని సంతోషంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇప్పటికే 170 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ, ధూళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవ సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి చిలుకా జయపాల్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ ఈటిపోగు వెంకట్రావు, ఆర్ఎంఓ శోభారాణి ఉన్నారు.

పోలీస్ సిబ్బంది క్రీడల్లో రాణించడం అభినందనీయం

ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



సీఐ, ఆర్ఐలను అభినందిస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: బాధ్యతతో విధులు నిర్వహిస్తూ, పలు క్రీడల్లో రాణించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. గతనెల 18న విజయవాడలో పోలీస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా పోలీస్ అధికారులు రన్నర్‌గా నిలిచారు. రూ.15 వేలు గెలుచుకున్నారు. కప్, నగదు బహుమతితో విజేతగా నిలిచిన తెనాలి రెండో పట్టణ పీఎస్ సీఐ వెంకట్రావు, హోంగార్డుల ఆర్ఐ రమేష్‌కృష్ణన్‌ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ

కాకుమాను: ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాకు కాంప్లెక్స్ ఎరువులు, యూరియా లక్ష మెట్రిక్ టన్నులను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 58,678 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, యూరియాను రైతులకు అందజేసినట్లు వివరించారు. జిల్లాలో ఏ ఒక్క రైతు యూరియా కొరతతో ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నల్లమోతు వీరయ్య, పంగులూరి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల శ్రీహరిరావు పాల్గొన్నారు.

విశ్రాంత టీచరమ్మకు వందనం

పుట్టిన రోజు వేడుకలు జరిపిన కుటుంబం

- చిరుప్రాయంలోనే వివాహం..
- మొక్కవోని దీక్షతో టీచర్ ట్రైనింగ్ పూర్తి
- రిటైరయ్యే నాటికి తీసుకున్న జీతం రూ.350!
- ప్రస్తుత పింఛన్ రూ. 20 వేలు!



కొల్లి వెంకట సుబ్బమ్మను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు

చుండూరు(భట్టిప్రోలు): శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలికి కుటుంబ సభ్యులు జన్మదిన వేడుకలు జరిపిన సంఘటన ఇది. చుండూరు మండలం చినపరిమికి చెందిన కొల్లి వెంకట సుబ్బమ్మకు పదేళ్ల చిరుప్రాయంలోనే అదే గ్రామానికి చెందిన అవుతు రమణారెడ్డితో వివాహం జరిగింది. వివాహమైన కొద్ది రోజులకే భర్త కబడ్డీ ఆడుతూ మరణించారు. ఆమెను గ్రామానికి చెందిన కనకదుర్గ ప్రసాదలింగం ప్రోత్సహించి.. దుగ్గిరాలలో 8వ తరగతి వరకు చదివించారు. 19951లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఆమె వివాహానికి ముందు ఒకటో తరగతి మాత్రమే చదివారు. ఆమె మొక్కవోని దీక్షతో 1951 నుంచి 1953 వరకు నరసాపురంలో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి... అదే సంవత్సరం దుగ్గిరాల మండలం మంచికలపూడిలో ఒక ప్రైవేట్ స్కూల్‌లో విద్యాబోధన చేశారు. ఆమెకు అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలో 1955లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి 23 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయురాలిగా పని చేశారు. 1978లో ఆమె రిటైర్‌మెంట్ అయ్యే నాటికి అందుకున్న జీతం రూ.350 కాగా.. ఫించన్ రూ. 100తో ప్రారంభమై నేడు రూ. 20 వేలు తీసుకుంటోంది. ఆమె తన సోదరుడు కొల్లి సుబ్బారెడ్డి దగ్గరే ఉంటున్నారు. సుబ్బమ్మ బాగోగులు వారి కుటుంబ సభ్యులు చూసుకుంటున్నారు.

కుటుంబ సభ్యులు, సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఉప సర్పంచ్ అవుతు సాయి బాబు రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం ఆమె 100వ రోజు పుట్టినరోజు వేడుకలు జరిపి ఆమెచేత కేక్ కట్ చేయించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. రిటైర్‌మెంట్ అనంతరం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మన్ననలను చూరగొన్నారు. ప్రస్తుతం ఆమె తన పనులు తానే చేసుకుంటున్నారు.

బుడంపాడులో వ్యక్తి దారుణ హత్య

మద్యం మత్తులో ఘాతుకం



ఘటనా స్థలంలో వేణు మృతదేహం

గుంటూరు రూరల్: మద్యం మత్తులో ఘర్షణ ఒకరిని హత్య చేసిన ఘటన బుడంపాడులో బుధవారం చోటుచేసుకుంది. నల్లపాడు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. బుడంపాడు గ్రామానికి చెందిన చెరుకూరి వేణు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతడికి ఐదేళ్ల క్రితం రమ్యతో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో వేణు రోజు మాదిరిగా నగర శివారుల్లోని ఒక బార్ వద్ద మద్యం తాగేందుకు వెళ్లాడు. అదే బార్ వద్ద తమ వీధికి చెందిన జయ అనే వ్యక్తి వేరే వారితో గొడవ పడుతున్నాడు. ఎదుటి వారికి వేణు సపోర్ట్ చేశాడు. దీంతో జయ, వేణు వాదులాడుకున్నారు. అనంతరం అక్కడి నుంచి వేణు, పంచాయతీ కార్యాలయం వద్ద మద్యం తాగేందుకు వెళ్లాడు. దీంతో జయ కూడా అక్కడికే మద్యం తీసుకునేందుకు వచ్చాడు. అక్కడ మద్యం తాగి గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో వేణు హత్యకు గురయ్యాడు. తెల్లవారుజామున వేణు శవమై పడి ఉండడంతో గ్రామస్తులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

అట్టహాసంగా పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



విజయవాడ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ మీట్‌లో పావురాలను వదులుతున్న అతిథులు

విజయవాడ స్పోర్ట్స్: 25వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్స్ స్పోర్ట్, గేమ్స్ బాలబాలికల పోటీలు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్, సాంకేతిక విద్యా కమిషనర్ సి.నాగరాణి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులు తొలుత క్రీడా జ్యోతితో మైదానంలో ప్రదర్శన ఇచ్చారు. సౌరభ్‌గౌర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ వరకు జరిగే పోటీల్లో 1600 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అనంతరం వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య జేడీ పద్మావతి, ఆర్‌జేడీలు సత్యనారాయణమూర్తి, నిర్మల్‌కుమార్‌ప్రియ, సాంకేతిక విద్య బోర్డ్ సెక్రటరీ కె.విజయ భాస్కర్, విజయవాడ మునిసిపల్ కారొరేషన్ ఐదో డివిజన్ కార్పొరేటర్ సి.హెచ్.ఉషారాణి, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయసారథి పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ రహెమాన్ ఖాన్ మృతి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



అబ్దుల్ రహెమాన్ ఖాన్(ఫైల్)

చిలకలూరిపేట: ఇస్లామిక్ పండితుడు, మదర్సా ఏ జీనతుల్ ఖురాన్ అరబిక్ కాలేజ్ వ్యవస్థాపకుడు మౌలానా అబ్దుల్ రహెమాన్‌ఖాన్(94) బుధవారం మృతి చెందారు. ఢిల్లీలోని ఇస్లామియా యూనివర్సిటీలో ధార్మిక విద్యనభ్యసించిన ఆయన ఖురాన్, హదీసులలోని ప్రతి పంక్తి యొక్క అర్థం, తాత్పర్యం, సందర్భ విశ్లేషణ చేయటంలో నిష్ణాతులుగా ఖ్యాతి గడించారు. 1973లో పట్టణంలోని మద్దినగర్‌లో మదర్సా ఏ జీనతుల్ ఖురాన్ అరబిక్ కాలేజి స్థాపించి ఎంతో మంది ఇస్లామిక్ పండితులను, హఫీజులను తీర్చిదిద్దారు. వీరికి ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వి హుదా సొసైటీ అధ్యక్షుడిగా సేవా కార్యక్రమాల ద్వారా సుపరిచితుడు. నాలుగో కుమారుడు పఠాన్ తలహాఖాన్ వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, గుర్రాలచావిడిలోని హుదా భవనంలో మౌలానా భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గురువారం ఉదయం 9గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విజ్ఞాన్‌కు ఎన్‌పీటీఈఎల్ ఏఏ గ్రేడ్



సర్టిఫికెట్ అందుకుంటున్న విజ్ఞాన్ డీన్ జాకీర్ హుసేన్

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయ స్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో 'ఏఏ గ్రేడ్' లభించిందని వీసీ పీ నాగభూషణ్ బుధవారం తెలిపారు. స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జాతీయ స్థాయిలో 22వ ర్యాంక్ సాధించి ఏఏ గ్రేడ్‌ను సొంతం చేసుకుందని చెప్పారు. 2022లో ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో జూలై నుంచి డిసెంబర్ వరకు నిర్వహించిన కోర్సులలో ఉత్తమ ప్రతిభకు గాను విజ్ఞాన్ యూనివర్సిటీకి "ఏఏ గ్రేడ్" లభించిందని వీసీ వివరించారు. వీటితో పాటు గరిష్ఠంగా ఎక్కువ మంది డొమైన్ స్కాలర్స్ కలిగిన వర్సిటీగా కూడా గుర్తింపు పొందింది. "ఏఏ గ్రేడ్" సర్టిఫికెట్‌ను విజ్ఞాన్ వర్సిటీ డీన్, ఎన్‌పీటీఈఎల్ కోఆర్డినేటర్ షేక్ జాకీర్ హుసేన్‌కు ఐఐటీ మద్రాస్‌కు సంబంధించిన నిర్వాహకులు అందజేశారు. సర్టిఫికెట్ రావటానికి కృషి చేసిన వారిని చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.

భట్టిప్రోలును సందర్శించిన ముంబై విద్యార్థులు

భట్టిప్రోలు: స్థానిక బౌద్ధ స్తూపాన్ని ముంబై యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం సందర్శించారు. దేశంలోని బౌద్ధమత ఆనవాళ్లపై అధ్యయనంలో భాగంగా ఆ విశ్వ విద్యాలయంలో పురావస్తు శాస్త్రంలో గౌతమ బుద్ధ చరిత్రను పరిశోధిస్తున్న 300 మంది విద్యార్థుల్లో 103 మంది ఇక్కడికి రెండు ప్రత్యేక బస్సుల్లో విచ్చేశారు. వీరు వయో పరిమితితో సంబంధం లేకుండా ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. స్తూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించి అందరూ సామూహికంగా ప్రార్థనలు చేశారు.

అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్ చేతుల మీదుగా అండర్-19 జట్టు కెప్టెన్ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.



గిల్ జిగేల్...


గిల్

- భారత ఓపెనర్ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2–1తో సిరీస్ సొంతం

అహ్మదాబాద్: మోదీ స్టేడియంలో భారత్ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2–1తో సిరీస్ గెలుచుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' హార్దిక్ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్ విధ్వంసం

ఇషాన్ కిషన్ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్, త్రిపాఠి కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్ స్కోరు 156/3. శుబ్‌మన్ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్... లిస్టర్, టిక్నర్, ఫెర్గూసన్ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్ పేస్‌కు కివీస్ బ్యాటర్స్ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్ విజయానికి బాటపడింది. మిచెల్, సాన్‌ట్నర్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.


సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ హార్దిక్

స్కాన్ చేయండి
ఈ రోజు హైలైట్ కొరకు

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్ రాహుల్, రోహిత్, కోహ్లి ఈ ఘనత సాధించారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్ 1; గిల్ (నాటౌట్) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్ (బి) సోధి 44; సూర్యకుమార్ (సి) బ్రేస్‌వెల్ (బి) టిక్నర్ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్ (బి) మిచెల్ 30; హుడా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1–7, 2–87, 3–125, 4–228.
బౌలింగ్: లిస్టర్ 4–0–42–0, బ్రేస్‌వెల్ 1–0–8–1, ఫెర్గూసన్ 4–0–54–0, టిక్నర్ 3–0–50–1, ఇష్ సోధి 3–0–34–1, సాన్‌ట్నర్ 4–0–37–0, మిచెల్ 1–0–6–1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; చాప్‌మన్ (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్ (సి) మావి (బి) ఉమ్రాన్ 35; బ్రేస్‌వెల్ (బి) ఉమ్రాన్ 8; సాన్‌ట్నర్ (సి) సూర్య (బి) మావి 13; ఇష్ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్ (సి) ఉమ్రాన్ (బి) పాండ్యా 0; టిక్నర్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 1; లిస్టర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్) 66. వికెట్ల పతనం:** 1–4, 2–4, 3–5, 4–7, 5–21, 6–53, 7–53, 8–54, 9–66, 10–66. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4–0–16–4, అర్ష్‌దీప్ సింగ్ 3–0–16–2, ఉమ్రాన్ మాలిక్ 2.1–0–9–2, కుల్దీప్ యాదవ్ 1–0–12–0, శివమ్ 2–0–12–2.

ఆంధ్ర 379 ఆలౌట్

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేసిన విహారి


విహారి

ఇండోర్: డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్ (149; 18 ఫోర్లు, 1 సిక్స్) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్ లలిత్ మోహన్ (22 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్ జైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

జాతీయ స్కూల్స్ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు


యశ్వి జైన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్ విఘ్నేశ్ (7.5 పాయింట్లు)... అండర్-15 బాలికల విభాగంలో యశ్వి జైన్ (7 పాయింట్లు)... అండర్-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21–13, 21–14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21–17, 19–21, 23–21తో చెయుక్ యి లీ (హాంకాంగ్)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21–14, 19–21, 25–27తో హియో క్వాంగ్ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్ వర్మ 14–21, 16–21తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో.. మిథున్ 18–21, 12–21తో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ జోడీ 21–11, 21–16తో టై అలెగ్జాండర్–జోసెఫిన్ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా

జైసల్మేర్‌లో జైలర్


● రజనీకాంత్

రాజస్తాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్' చిత్ర యూనిట్ ఇప్పుడు 'జైసల్మేర్'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్తాన్‌లో ల్యాండ్ అయ్యారు రజనీకాంత్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...

హెలికాప్టర్‌లో షూటింగ్ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్. కాగా కమల్ హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్, షూటింగ్ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్ ఇలా హెలికాప్టర్ రైడ్ చేస్తున్నారన్నది కోలీవుడ్ టాక్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.


● కమల్‌హాసన్

పల్లెటూరి ప్రేమ

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. వైభవ్ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్ లవ్ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.


● 'శశివదనే'లో ఓ దృశ్యం

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

– శౌరి చంద్రశేఖర్ టి. రమేష్

''**మా** నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్ టి. రమేష్. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్ టి.రమేష్ మాట్లాడుతూ– ''రామ్ గోపాల్ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్ పాయింట్ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.


● శౌరి చంద్రశేఖర్

పదిహేనేళ్ల తర్వాత....


● విజయ్, త్రిష

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్– హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో విజయ్, త్రిష ఐదోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్' తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

వింతగా మారబోతోంది


● బ్రహ్మానందం

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో భరత్ కుమార్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్ కౌశిక్, సాయికృష్ణ గద్వాల్, విజయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్ భాస్కర్.

తెరపైకి జాక్సన్ జీవితం

పాప్ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్ జాక్సన్ జీవితంతో 'మైఖేల్' పేరుతో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్ పుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్ కుమారుడు జాఫర్ జాక్సన్ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్. ''మైఖేల్ జాక్సన్ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్ జాక్సన్ 2009 జూన్ 25న మరణించిన విషయం తెలిసిందే.


● మైఖేల్


● జాఫర్

లవ్.. యాక్షన్


● రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్, యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, కెమెరా: సాయికుమార్.

అయోమయంలో...


● రణధీర్, శుభశ్రీ

రణధీర్, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్ ప్రసాద్ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)
Editor: V. Murali, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.